# కథ -అరుణ

# మహతీ కల్యాణం

**సమయం తెల్లవారు జామున నాలుగున్నర గంటలు.**

**హైదరాబాద్ నుండి నర్సాపూర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ స్టేషన్‌లో ఆగింది.**

**తన బ్రీఫ్‌కేస్ తీసుకుని రైలు దిగడానికి డోర్ వైపు నడిచాడు చరణ్. రైలు దిగే ప్రయాణీకుల్లో బోగీలో అందరికంటే చివర నిలబడ్డాడు.**

**కుడి చేతి వైపు మిడిల్ బెర్త్‌మీద కనిపించిన సెల్‌ఫోన్ అతని దృష్టిని ఆకర్షించింది. బెర్త్ ఖాళీగా ఉండడంతో అక్కడ విశ్రమించిన ప్రయాణీకుడు రైలు దిగి వెళ్లిపోయి ఉంటాడని అతనికర్థమైంది.**

రెండడుగులు ముందుకు వేశాడు. అతని మెదడు చురుగ్గా పని చేసింది.

చటుక్కున వెనక్కి వచ్చి బెర్త్ మీద ఉన్న సెల్‌ఫోన్ అందుకున్నాడు.

రైలు దిగి కొద్ది నిమిషాలు ప్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డాడు.

అతని చూపులు సెల్‌ఫోన్ మీద పడ్డాయి. బటన్ నొక్కబోయి ఆగిపోయాడు.

తన చేతిలోని సెల్ క్లియర్‌గా కనిపించేటట్లు పట్టుకుని అన్నివైపుల దృష్టిసారించాడు.

ఎవరూ దగ్గరకు రాలేదు.

సెల్ షర్ట్ జేబులో పెట్టుకుని నెమ్మదిగా స్టేషన్ బయటికి వచ్చాడు. మరో రెండు నిమిషాల తర్వాత ఆటో ఎక్కాడు.

* * *

ఫ్లాట్ సింహద్వారం ముందు తడిబట్టతో తుడిచి చాక్‌పీస్‌తో ముగ్గు వేస్తున్న అక్క సువర్చలను చూసి నవ్వుకున్నాడు ఆటో దిగి గేటు దాటి లోపలికి వస్తూ.

తలెత్తి చూసి నవ్విందామె.

"నీ కోసమే ఎదురు చూస్తున్నాను. లోపలికి పద" అంది పక్కకు జరుగుతూ.

గుమ్మం వద్ద ఉన్న కుర్చీలో కూర్చుని బూట్లు విప్పి పొందికగా చెప్పుల స్టాండ్‌లో పెట్టాడు.

"బ్రష్ చేసుకో. ఫిల్టర్ వేశాను. వేడిగా కాఫీ తాగుదువు గాని" అంది సువర్చల.

"బావగారు, ధవళ ఇంకా నిద్ర లేవలేదా?" అడిగాడు.

"ఊహు! ఏడు దాటితే గాని ఆయన నిద్ర లేవరు. తెల్లవారు జామున నాలుగు దాటాక నాకు పడుకోవాలనిపించదు. ధవళ ఎప్పుడు ఆకలి వేస్తే అప్పుడు లేచి ఏడుస్తుంది" నవ్వింది.

బ్రీఫ్ కేస్‌లో నుండి టవల్, లుంగీ తీశాడు.

"పరాయి ఇంటికి వచ్చినట్టు ఇక్కడికి వస్తూ టవల్, లుంగీ కూడా తెచ్చుకోవాలేమిట్రా?" తమ్ముడ్ని మందలించిందామె.

అతను నవ్వాడు కాని సమాధానం చెప్పలేదు.

మరో పావుగంట తర్వాత స్నానం చేసి వచ్చి అక్క వేడిగా అందించిన ఫిల్టర్ కాఫీ తాగాడు.

కాఫీ రుచిగా బావుంది.

నిన్న రోజంతా హైదరాబాద్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఒకింత టెన్షన్‌తో గడిపాడు. తిట్టడానికి చాన్స్ దొరికిందే చాలు అన్నట్లుగా పాతిక మంది ఆఫీసర్లను హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో కూర్చోబెట్టి టార్గెట్‌ను చేరుకోలేకపోయిన వారికి అక్షింతలు వేశాడాయన. లక్ష్యాలను అధిగమించిన శాఖల సిబ్బందిని పొగుడుతూనే ఇంకా బాగా పనిచేయాలని ధర్మోపదేశం చేశాడు. ప్రతి శాఖ పనితీరు మీద ఆయనకు అవగాహన ఉంది. కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నవారిలో ఏ ఒక్కరినీ వదిలి పెట్టలేదు. ఓ పక్క తన పని సామర్థ్యాన్ని అభినందిస్తూ, ఇంకా బాగా కృషి చేయాలని, వచ్చే ఏడాది టార్గెట్ పెంచుతున్నానని చెప్పాడాయన.

నిజామాబాద్‌లోని ఓ ప్రభుత్వరంగ బ్యాంక్‌లో మార్కెటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు చరణ్.

హైదరాబాద్‌లో కాన్ఫరెన్స్‌కు హాజరై అక్క దగ్గరకు విజయవాడ వచ్చాడిప్పుడు.

కాఫీ తాగి ఖాళీ కప్ తీసుకు వెళ్లి కిచెన్ సింక్‌లో పెట్టాడు.

కూరగాయలు తరుగుతున్న అక్కతో కొద్దిసేపు మాట్లాడాడు.

రైలులో దొరికిన సెల్‌ఫోన్ గుర్తొచ్చిందతనికి.

"అక్కా! ఇందాక రైలు దిగబోతుండగా ఒక బెర్త్ మీద.." ఆమెతో చెప్పబోయాడు.

హాల్‌లో టీపాయ్ మీద అతను ఉంచిన సెల్‌ఫోన్ మోగింది.

ఒక్క ఉదుటున కిచెన్‌లో నుండి వచ్చి మొబైల్ అందుకున్నాడు చరణ్.

"హలో" అన్నాడు.

అతవలి నుండి అస్పష్టంగా ఓ కంఠస్వరం వినిపించింది.

"హలో" అన్నాడు బయటికి అడుగులు వేస్తూ.

మరోసారి బొంగురు గొంతుతో కూడిన ఓ వ్యక్తి మాటలు వినిపించాయి. మాట్లాడుతున్నది పుంలింగమో, స్త్రీ లింగమో అతనికి అర్థం కాలేదు.

"హలో! మీరెవరో తెలుసుకోవచ్చా? నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో సెల్ దొరికింది. మీదేనా?" అడిగాడు.

కీచుగొంతు వినిపించింది కొద్ది క్షణాలు. వెనువెంటనే కాల్ డిస్కనెక్ట్ అయింది.

రిసీవ్డ్ కాల్స్‌లో తనకు ఏ ఫోన్ నంబర్ నుండి కాల్ వచ్చిందో చూశాడు. ఆ నంబర్‌కు డయల్ చేశాడు.

మళ్లీ కీచుగొంతు 'హలో' అంది. హలో అన్న మాట కూడా అతనికి సరిగా అర్థం కాలేదు నిజానికి. అలా అని ఉంటారని ఊహించుకున్నాడు.

అవతలి వ్యక్తి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నా చరణ్‌కు ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు.

"మీరేం చెబుతున్నారో నాకు వినిపించడం లేదు. మళ్లీ చెప్పండి" గట్టిగా అరిచాడు ఈసారి.

కాల్ డిస్కనెక్ట్ అయింది మళ్లీ.

"ఏమిటిరా గొడవ?" చేతులు తుడుచుకుంటూ వచ్చి అతని పక్కన నిలబడింది సువర్చల.

జరిగిన విషయం ఆమెకు చెప్పాడు.

"ఇందాక విజయవాడ స్టేషన్‌లో నేను రైలు దిగబోతుండగా ఒక బెర్త్‌మీద సెల్‌ఫోన్ కనిపించింది. ముందు సందేహించినా తర్వాత సెల్ తీసుకున్నాను. నాకెందుకులే అని నేను వచ్చేస్తే ఈ ఫోన్ దొంగల కళ్లలో పడితే ఇంచక్కా జేబులో వేసుకుంటారు. అసలు యజమానికి అందించాలన్న కోరికతో సెల్ తీసుకుని కిందికి దిగాను. కొద్దిసేపు వెయిట్ చేసినా

ఎవరూ రాలేదు. అందుకని ఇంటికి వచ్చేశాను. రైలులో మొబైల్ మరిచిపోయామన్న సంగతి వాళ్లకు గుర్తొచ్చి ఎప్పుడు ఫోన్ చేస్తారా అని ఎదురు చూస్తున్నాను. రెండుసార్లు ఫోన్ రింగైంది. కానీ అసలు యజమాని మాట్లాడుతున్నారో లేక మరొకరు కాల్ చేశారో తెలియదు. ఏమంటున్నారో కూడా అర్థం కావడం లేదు" అన్నాడు.

"కాస్సేపాగితే వాళ్లే ఫోన్ చేస్తారు" అంది సువర్చల.


"మూడు రోజుల నుండి నేను పడుతున్న బాధను, ఇబ్బందిని ఈ సెల్‌ఫోన్ యజమాని పడకూడదు. ఎంత త్వరగా అతనికి అందజేస్తే అంత బావుంటుంది" చరణ్ గొంతులో ఒకింత విచారం తొంగి చూసింది.

"ఏమైందిరా?" ఆందోళనగా అడిగింది.

"మూడు రోజుల క్రితం రైలులో ప్రయాణం చేస్తుండగా నా సెల్ పోయింది. తర్వాత చాలాసార్లు నా నంబర్‌కు ఫోన్ చేశాను కానీ ఫలితం లేకపోయింది. చోరుల చేతిలోకి వెళ్లిందని అర్థమైంది. రైలు ప్రయాణీకుల నుండి సెల్‌ఫోన్లు తస్కరించే ముఠాలు ఉన్నాయి. ఏం చేస్తాం? పోలీస్ రిపోర్ట్ ఇచ్చినా ప్రయోజనం ఉండదు. మరో ఫోన్ తీసుకోవాలి" నిట్టూర్చాడు.

సువర్చల బాధపడింది.

"అదా విషయం! నీ సెల్ దొంగలు ఎత్తుకుపోయారన్నమాట! ఈ రెండు, మూడు రోజులుగా నువ్వు సెల్ నుండి చేయకుండా వేరే నంబర్ల నుండి మాకు ఫోన్ చేశావేమిటా అనుకున్నాను. సెల్‌పోయిందా?" నొచ్చుకుంది.



"దొంగలు ఎత్తుకుపోయేంత పెద్ద వస్తువేం కాదు. జేబులో పెట్టుకుని రైలు దిగి ఉంటారు" వాతావరణం తేలిక చేస్తూ నవ్వు ముఖం పెట్టాడు.

"అదేలేరా! దొంగలు ఎత్తుకుపోవడానికి, చోరీ చేసి స్టైల్‌గా జేబులో వేసుకోవడానికి తేడా ఏముంది గనక?" సమర్థించుకుంది సువర్చల.

తమ్ముడి చేతిలో నుండి సెల్ అందుకుంది. సెల్ మోగింది. వెంటనే ఫోన్ అతనికి ఇచ్చింది. ఇంతకు ముందు చేసిన నంబర్ నుండి కాల్ వచ్చింది.

"నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో సెల్‌ఫోన్ మరిచిపోయాను. మా సెల్ మాకు ఇచ్చేయండి ప్లీజ్" ఆడ గొంతు అభ్యర్థనగా అడిగింది.

"అమ్మా! మీ ఫోన్ మీకు ఇవ్వాలన్నదే మా ఆరాటం. ఇంతకు ముందు ఎవరో రెండుసార్లు మాట్లాడారు గాని ఏం మాట్లాడారో ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు తల్లీ" అన్నాడు చరణ్.

"మా ఫోన్ మాకు త్వరగా ఇవ్వండి" ఆమె గొంతులో ఆదుర్దా తొంగి చూసింది.

అవతలి వ్యక్తి ఆందోళనను చరణ్ సహృదయంతో అర్థం చేసుకున్నాడు.

"మీరు ఎక్కడి నుండి మాట్లాడుతున్నారు" అడిగాడు.

"టిక్కిల్ రోడ్ నుండి"

"నేను బృందావన్ కాలనీ నుండి మాట్లాడుతున్నాను. దగ్గరే కాబట్టి ఇబ్బంది లేదు. డివి మేనర్ హోటల్ తూర్పు గేట్ దగ్గర ఉండండి. ఐదు నిమిషాల్లో నేను అక్కడికి వచ్చి అందజేస్తాను. మిమ్మల్ని ఎలా గుర్తు పట్టాలి?" అడిగాడు.

"నేను, మా అక్క వస్తాము. పింక్ ఎల్లో కలర్ డ్రస్‌లో ఉన్నాము. మీరు సులభంగా గుర్తుపట్టడానికి డ్రస్ కలర్ చెప్తాను" రవ్వంత తడబడిందామె.

"సరే! నేను వెంటనే బయల్దేరుతున్నాను" చెప్పి సెల్ ఆఫ్ చేశాడు.

"అక్కా! బావగారి బైక్ తాళాలు ఇవ్వవూ! పది నిమిషాల్లో వచ్చేస్తాను" పక్కకు తిరిగి ఆమెను అడిగాడు.

తాళం చెవితో పాటు హెల్మెట్ కూడా అందించింది సువర్చల.

"హెల్మెట్ వద్దులే! దగ్గరే కదా!" అన్నాడు.

"టైమ్ బావుండకపోతే ట్రాఫిక్ కానిస్టేబుల్ పట్టుకోవచ్చు. ఉత్తి పుణ్యానికి జరిమానా కట్టాలి. పెట్టుకోరా" అంది.

అక్క మాట కాదనలేక హెల్మెట్ పెట్టుకున్నాడు.

"హెల్మెట్ పెట్టుకున్నాను కాని డ్రైవింగ్ లైసెన్స్ తెచ్చుకోలేదు" ఆమెతో చెప్పి బయటికి నడిచాడు నవ్వుతూ.

డివి మేనర్ హోటల్ గేటు పక్కన బైక్ ఆపి హెల్మెట్ తీసి రోడ్డుకు రెండువైపులా చూశాడు.

గులాబీ, పసుపు రంగులో ఉన్న దుస్తులు ధరించిన ఇద్దరు ఆడపిల్లలు హోటల్ వైపు వస్తూ కనిపించారు.

షర్ట్ జేబులో నుండి సెల్ తీసి వారికి కనిపించేటట్టు పట్టుకున్నాడు.

పసుపు రంగు డ్రస్‌లో ఉన్న అమ్మాయి పక్కన ఉన్న యువతి చేతిమీద తట్టి అతని వైపు చూపుడు వేలితో చూపించింది.

ఇద్దరూ అతన్ని సమీపించారు.

పసుపు రంగు చుడీదార్ వేసుకున్న అమ్మాయి ఆతురతతో చెయ్యి చాపింది.

అతను సెల్ అందించాడు.

పింక్ కలర్ డ్రస్‌లో ఉన్న అమ్మాయి కృతజ్ఞతలు చెప్పింది.

"మా ఫోన్ మాకు జాగ్రత్తగా అందించారు. చాలా థాంక్స్ అండీ!" అంది.

ఆమె కృతజ్ఞతలు స్వీకరిస్తున్నట్లుగా నవ్వాడు.

పసుపు యువతి కృతజ్ఞతలు చెబుతున్నట్లుగా రెండు చేతులు జోడించి నమస్కరించింది.

చరణ్ గాభరాపడ్డాడు. 'బాబోయ్! కృతజ్ఞత పాలు ఎక్కువగా ఉన్నట్లుండి ఈ అమ్మాయిలో' అనుకున్నాడు. తను కూడా చేతులు జోడించి ప్రతి నమస్కారం చేశాడు.

"చాలా టెన్షన్ పడ్డాం కదూ! లక్కీగా వెంటనే దొరికింది.." గులాబీ అమ్మాయి లొడలొడా మాట్లాడుతుంటే పసుపు భామ పెదవి విప్పకుండా ఆనందంగా తలూపుతోంది. ఆమె మూగపిల్ల అని అతనికి అర్థమైంది.

చూడడానికి చక్కగా కుందనపు బొమ్మలా ఉంది. మూగతనం ఒక్కటే లోపం అనుకున్నాడు. ఆమె వైపు జాలిగా చూశాడు.

పింక్ మరోసారి నోటితో థాంక్స్ చెప్పగా, ఎల్లో మళ్లీ మౌనంగా నమస్కరించింది.

వారు నాలుగు అడుగులు వేసిన వెంటనే హెల్మెట్ పెట్టుకుని బైక్ స్టార్ట్ చేశాడు చరణ్.

లోపలికి అడుగు పెడుతుండగా నిద్రలేచిన మేనకోడలు ధవళ నవ్వుతూ ఎదురొచ్చింది.

రెండేళ్ల పాపను ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు ప్రేమగా.

"సెల్ ఇచ్చావా?" అడిగింది సువర్చల ఇడ్లీ ప్లేటులో అల్లం పచ్చడి, నెయ్యి వేస్తూ.

"ఇచ్చాను. ఇద్దరు ఆడపిల్లలు వచ్చి తీసుకున్నారు. వాళ్లలో ఒకామెకు మాటలు రావనుకుంటాను. మూగ పిల్ల అయి ఉంటుంది పాపం! చూడడానికి చక్కగా ఉంది" జాలిపడ్డాడు.

"అయ్యో పాపం, మూగపిల్లా?" సువర్చల కూడా సానుభూతి ప్రదర్శించింది.

తమ్ముడి చేతుల్లో నుండి పాపను ఎత్తుకుంది.

"ఇడ్లీ తిను. చల్లారిపోతే బావుండదు. అక్కడ రోజూ హోటల్ భోజనం. ఏం తింటున్నావో ఏమిటో? ఇక్కడ ఉన్న రెండు రోజులు వేళకు తిను" అంది.

సువర్చల భర్త పినాకపాణి నిద్రలేచాడు. బావమరిదిని పలకరించాడు ఆత్మీయంగా.

మరికొద్ది సేపట్లో గుడివాడ నుండి చరణ్ తల్లిదండ్రులు వచ్చారు. దాదాపు రెండు నెలల తర్వాత కలుసుకోవడంతో అందరూ ఆనందంగా కబుర్లు చెప్పుకున్నారు.

సాయంత్రం నాలుగు గంటలకు పినాకపాణి స్నేహితుడు వెంకట్ వచ్చాడు.

## విద్యాబాలన్ రూటే వేరు!

**చూడ్డానికి ఎంతో అమాయకురాల్లా అనిపించే విద్యాబాలన్ ఇటీవల 'గురు' సినిమాలో ముద్దు సీన్‌లో కనిపించగానే గడుసుపిల్లే అని అంతా ముక్కున వేలేసుకున్నారు. తొలి చిత్రం 'పరిణీత'లో ఎంచక్కా చీరల్లోనే కనిపించింది. అలాగే 'లగేరహో మున్నాభాయ్'లో స్కర్ట్‌లు గట్రా వేస్కుని కాస్త మోడర్న్‌గా కనిపించింది. కానీ తాజాగా ఆమె నటిస్తున్న ఓ చిత్రంలో మాత్రం పూర్తిగా పాశ్చాత్య తరహా దుస్తుల్లోనే కనిపించబోతోందిట. 'హే బేబీ' అనే ఈ సినిమాలో బోల్డంత రొమాంటిక్‌గా కనిపించే వెస్టర్న్ డ్రెస్సుల్లో విద్య దర్శనమివ్వబోతోందిట.**



"బయల్దేరదామా?" అన్నాడతను వచ్చిన వెంటనే.

అందరూ కలిసి పెళ్లిచూపులకు వెంకట్ పినతండ్రి ఇంటికి బయల్దేరారు.

ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయి హైదరాబాద్‌లో బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తోంది. చిన్నమ్మాయి చదువుకుంటోంది.

చరణ్ కుటుంబ సభ్యులను సాదరంగా ఆహ్వానించాడు వెంకట్ పినతండ్రి.

పరిచయాలయ్యాయి.

ఓ అమ్మాయి కంప్యూటర్ టెక్స్ట్‌బుక్, నోట్‌బుక్‌తో లోపలికి వచ్చింది. బహుశా క్లాస్ నుండి వచ్చి ఉంటుంది.

"మా చిన్నమ్మాయి సుమతి" చెప్పాడాయన.

అందరి వైపు చిరునవ్వుతో చూసిందామె.

చరణ్ వైపు పరిశీలనగా కొద్ది క్షణాలు చూసింది. పలకరింపుగా నవ్వి గదిలోకి వెళ్లింది.

ఆమెను ఎక్కడో చూసిన ఫీలింగ్ కలిగింది చరణ్‌కు.

అతని మెదడు చురుగ్గా పనిచేయసాగింది. ఆమె ఎవరో గుర్తొచ్చింది. ఉదయం హోటల్ గేటు దగ్గర కలిసిన పింక్ డ్రస్‌లో ఉన్న అమ్మాయి అని అర్థ మైంది.

అతని ఆలోచనలు సాగుతుండగానే ఓ అమ్మాయి తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పొందికగా చీర కట్టుకుని, కొద్దిపాటి నగలు ధరించి వారి ముందుకు వచ్చి కుర్చీలో కూర్చుంది.

"మా పెద్దమ్మాయి మహతి"

ఆమె చేతులు జోడించి అందరికీ నమస్కరిం చింది.

చరణ్ ఉలిక్కిపడ్డాడు. ఉదయం కనిపించిన ఎల్లో డ్రస్‌లో ఉన్న మూగ యువతి.

"ఎమ్.ఎ.చదివింది. హైదరాబాద్‌లో బ్యాంక్ ఉద్యోగంలో చేరి ఏడాది అయింది" వివరాలు చెప్పా డాయన.

బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తోందని చెప్పారు. కానీ మూగపిల్ల అని చెప్పలేదు. అతని కళ్లలో సానుభూతి తొంగి చూసింది.

వికలాంగుల కోటాలో ఉద్యోగం వచ్చింది కాబోలు అనుకున్నాడు.

అప్పటికే అతను ఓ నిశ్చయానికి వచ్చేశాడు. 'మూగపిల్ల అయితే మాత్రమేం? లక్షణంగా, కళకళ లాడుతూ ఉంది. ఈ అమ్మాయినే పెళ్ళిచేసుకోవాలి. పెళ్ళయ్యాక ఆమెను ఒప్పించి ఉద్యోగం మాన్పిం చాలి. పైకి చెప్పుకోలేకపోయినా వృత్తి బాధ్యతలతో ఆమె సతమతమవుతుందేమో! తాను మంచి హోదాలో ఉన్నాడు. భార్య ఉద్యోగం చేయాల్సిన అవ సరం లేదు. ఆమెను ఏ లోటు లేకుండా చూసుకో వాలి. అమ్మ, నాన్న ఒప్పుకోకపోయినా వాళ్లకు నచ్చ జెప్పి ఈ పెళ్లికి ఒప్పించాలి' చరణ్ ఆలోచనలు పరి పరి విధాలుగా ఉన్నాయి.

ఆమె వైపు ఇష్టంగా చూస్తున్నాడు.

మహతి తలెత్తి అతని వైపు చూసింది.

సెల్‌ఫోన్ భద్రంగా తమకు అందజేసిన యువ కుడే పెళ్లికొడుకు అని చెల్లాయి గదిలో చెప్పడం వల్ల చరణ్‌కు కృతజ్ఞతలు చెప్పింది మరోసారి కళ్లతోనే.

అతని ముఖంలో చిరునవ్వు తొంగి చూసింది.

"మా అమ్మాయి ఆరేళ్లు శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. బాగా పాడు తుంది" ఆమె తల్లి చెప్పింది.

చరణ్ ఉలిక్కిపడ్డాడు మళ్లీ.

అతని తల్లి సంతోషంగా చూసింది.

ఆమెకు కొద్దిగా సంగీత పరిజ్ఞానం ఉంది.

"త్యాగరాజ కీర్తన ఒకటి పాడమ్మా! వినాలని వుంది" అంది మహతివైపు ఇష్టంగా చూస్తూ.

మహతి ముగ్ధమనోహరంగా నవ్వింది కానీ పాడ లేదు.

"తనకు నిన్నటి నుండి త్రోట్ ఇన్‌ఫెక్షన్. అక్కా చెల్లెళ్ళిద్దరూ ఈరోజు ఉదయమే హైదరాబాద్ నుండి వచ్చారు. ఉదయం అసలు మాట్లాడలేకపో యింది. గొంతు పెగల్లేదు. ఈ పూట కొంచెం నయం" అంది ఆమె తల్లి.

చరణ్ మనసు తేలిక అయింది. రిలీఫ్‌గా చూశాడు. ఇంకా నయం. ఆమె మూగపిల్ల అని వెంటనే పైకి చెప్పలేదు. తన విజ్ఞతకు తననే అభినం దించుకున్నాడు.

ఉదయం సెల్‌ఫోన్‌లో రెండుసార్లు కీచుగొం తుతో మాట్లాడడానికి ప్రయత్నించి విఫలమైన వ్యక్తి ఎవరో అర్థమైంది.

మహతి పాడనందుకు చరణ్ తల్లి ఒకింత నిరాశ పడింది. కానీ వెనువెంటనే సర్దుకుంది.

పెద్దల మధ్య కొద్దిసేపు మాటలు దొర్లాయి. ఎక్కడో చుట్టరికం కలిసింది. హుషారుగా బంధు త్వాలు తిరగేసుకుంటున్నారు.

చరణ్, మహతి శ్రోతలుగా మిగిలారు.

చరణ్‌కు ఆమె బాగా నచ్చింది. మూగతనం ఉన్నా పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆమె మూగపిల్ల కాదని తెలిశాక ఇంకా ఆనందంగా అనిపించింది.

మహతికి కూడా అతను నచ్చినట్లు ఆమె చూపులు మౌనంగా సంభాషించాయి అతనితో క్షణ కాలం.

ఆమె లేచి గదిలోకి వెళ్లింది. తల్లి ఆమె వెనుకే నడి చింది.

సంబంధం ఖాయం చేసుకుంటూ మర్నాడు వెంకట్‌తో కబురు చేశారు.

అక్క ఒంటరిగా ఉన్నప్పుడు మహతిని చూసి తాను ఏ విధంగా అపోహ పడిందీ చెప్పాడు. సువ ర్చల నవ్వింది. "ఇంకా నయం. తొందరపడి అన లేదు. మాట్లాడకపోతే మూగతనం ఉందని ఎలా అనుకున్నావు? రెండేళ్ల క్రితం నాకు ఇలాగే గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చి రెండు, మూడు రోజులు మాట్లాడలే కపోయాను. నోరు తెరిచి మాట్లాడడానికి ప్రయత్నిస్తే మనకు తెలియని ఏవో శబ్దాలు వచ్చేవి కాని ఎదుటి వారికి అర్థమయ్యేది కాదు. మాట్లాడడంలో ఉన్న గొప్పదనం ఏమిటో నాకు అప్పుడు బోధపడింది " అంది.

అక్క మాటలకు కొద్దిగా సిగ్గుపడుతూ తలూ పాడు.

నెల రోజుల తర్వాత మహతీ కల్యాణం కనుల పండువగా జరిగింది విజయవాడలో.

పెళ్లయిన మర్నాడు గుడివాడలో సత్యనారా యణ స్వామి వ్రతం జరిగింది.

వ్రతం ముగిశాక చరణ్ తల్లి అత్తగారి హోదాలో "ఓ కీర్తన పాడమ్మా!" అని కోడల్ని అడిగింది.

శ్రావ్యమైన కంఠస్వరంతో 'సీతమ్మ మా యమ్మ శ్రీరాముడు మాకు తండ్రి' అంటూ వసంతరాగంలో త్యాగరాజస్వామి కీర్తన పాడింది.

'బంగారుతల్లి' కోడలి తలమీద చేయి వేసింది అత్తగారు ఆత్మీయంగా.

"సంగీత జ్ఞానం ఉన్న అమ్మాయి ఈ ఇంటికి కోడ లిగా వస్తే బావుండు అని ఆశపడ్డాను. నా కోరిక నెరవే రింది" అంది సంబరంగా.


మహతి హాయిగా నవ్వింది.

రెండు రోజుల తర్వాత తిరుమలలో స్వామివారి దర్శనం చేసుకుని కాటేజ్‌కు వచ్చాక వసపిట్టలా వాగు తున్న భార్యను చూసి నిశ్శబ్దంగా నవ్వుకున్నాడు చరణ్.

ఆమె గమనించింది.

"మీలో మీరు నవ్వుకుంటున్నారెందుకు?" అడి గింది.

అతను జవాబు చెప్పబోయేంతలో టేబుల్ మీద ఉన్న సెల్ మోగింది. మహతి స్నేహితురాలు ఫోన్ చేసింది.




నిమిషంలో సంభాషణ ముగిసింది. మహతి చేతిలో నుండి సెల్ అందుకు న్నాడు.

"నీ కంటే ముందు నీ సెల్‌తో నాకు జోడీ కుదిరింది. ఆ రోజు మొదటిసారి చూసినప్పుడు నువ్వు ఒక్కమాట కూడా మాట్లాడకపోతే మూగపిల్ల కాబోలు అను కున్నాను. ఇంత మాటకారివి అనుకో లేదు" అన్నాడు టేబుల్ మీద తన ఫోన్ పక్కన ఆమె ఫోన్ ఉంచుతూ.

చరణ్‌కు చేరువగా జరిగి కూర్చుని అతని భుజం మీద సంతోషంగా తలవా ల్చింది నవ వధువు.

☆